క్లుప్తంగా

అర్బన్ హెల్త్ సెంటర్‌లలో సేవలు భేష్



మంగళగిరి, మంగళగిరి టౌన్: అర్బన్ హెల్త్ సెంటర్‌లలో పేదలకు వైద్య సేవలు అందుతున్న తీరు అభినందనీయమని ఢిల్లీ ఏబీడీఎం జాయింట్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ కిరణ్ గోపాల్ కొనియాడారు. శుక్రవారం నగర పరిధిలోని గణపతి నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన కిరణ్‌గోపాల్ పేదలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. అర్బన్ హెల్త్ సెంటర్లలో పేదలకు అన్ని వైద్య సేవలు అందేలా తీర్చిదిద్దగం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏబీడీఎం స్టేట్ మోడల్ ఆఫీసర్ బీవీ రావు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుస్మిత, స్టేట్ టీమ్ మేనేజర్ యశ్వంత్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడికి సన్మానం



దుగ్గిరాల: పర్యావరణ వేత్త, రాష్ట్ర ప్రభుత్వ అటవీ, పర్యావరణ సలహాదారుడు కొమెర అంకారావుకు శుక్రవారం దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ.. మొక్కలలోని రకాలు, వాటి ఉపయోగాలు, పెంచవలసిన ఆవశ్యకతని విద్యార్థులకు వివరించారు. అనంతరం మండలంలోని ఉత్తమ రైతు అవార్డు గ్రహీత ఎర్రు పాపారావు, అంకారావులను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పి.గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చిన కార్పొరేషన్ సిబ్బంది



సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని డోలాస్‌నగర్, నులకపేట మధ్య నూతనంగా ఏర్పాటు చేసిన పైపులైన్లు కోసం కొన్నిచోట్ల గుంతలు తీసి వదిలేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో శుక్రవారం 'ప్రమాదాలకు నిలయంగా గుంత!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కమిషనర్ అలీమ్ బాషా వెంటనే ఆ గుంతలను పూడ్చాలని సంబంధిత సచివాలయ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఆ గుంతలను పూడ్చారు.

10 రోజులకు ఒకసారి తాగునీరు

తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో 10 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతుందని.. పరిష్కారానికి చర్యలు తీసుకోపోతే ఆందోళన తప్పదని సీపీఎం తాడికొండ మండల కార్యదర్శి చింతల భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 40 వేల మంది జనాభా ఉన్నప్పటికీ పైపులైన్‌లు మరమ్మతుల పేరుతో గుత్తేదారు చేస్తున్న జాప్యం కారణంగా పరిస్థితి నానాటికీ దిగజారుతుందన్నారు. కృష్ణానది చెంతనే ఉన్నా ఈ దుస్థితి ఉండడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారని, ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగునీరు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చలో తెనాలి కరపత్రాలు పంపిణీ

తాడేపల్లి రూరల్: శనివారం(నేడు) నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేక అమరారెడ్డినగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. న్యాయస్థానాలు ఎన్నిమార్లు చెప్పినా పోలీసుల తీరు మారడం లేదని అన్నారు. దళిత యువకులు తప్పుచేశారని తెలిస్తే చట్టం ముందు నిలబెట్టాలి గానీ.. నడిరోడ్డుపై లాఠీలకు పనిచెప్పకూడదని అన్నారు. ఈ దుశ్చర్యను ఖండించకపోతే భవిష్యత్తులో తెనాలి సంఘటనలు మరల జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, కె.బాబూరావు, బర్నబాస్, దుర్గారావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో సమయపాలన పాటించాలి

పొన్నూరు: ఈనెల 30వ తేదీ వరకు 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ డీలర్లను ఆదేశించారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు విధిగా సమయపాలన పాటిస్తూ కార్డుదారులందరికీ రేషన్ పంపిణీ చేయాలన్నారు.

ఛార్జీలు సరే... సేవలు ఏవి!

- నగరంలో పనిచేయని ఏటీఎంలు
- సీడీఎంల పరిస్థితి మరింత అధ్వానం
- సెలవు దినాల్లో తప్పని తిప్పలు



పనిచేయని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎం, సీడీఎం మిషన్లు

మంగళగిరి టౌన్: అత్యవసర పరిస్థితిల్లో నగదు కోసం ఏటీఎంలకు పరుగులు తీసే వినియోగదారులకు నిరాశే ఎదురవుతోంది. ఏటీఎంల వద్ద నాట్ వర్కింగ్, నో క్యాష్ బోర్డులు ఉండడంతో పలువురు ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. సరేలే అని పక్కనే ఉన్న మరో బ్యాంక్ ఏటీఎం దగ్గరకు వెళ్లినా అవి మూసి ఉండడమో, లేదా సర్వర్ సమస్య ఉండడమో జరుగుతోంది. దీంతో ఖాతాదారులకు అవస్థలు తప్పడం లేదు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఎస్‌బీఐ బ్యాంకుకు సంబంధించి 10 శాఖలు ఉన్నాయి. అన్ని శాఖల్లో కలిపి సుమారు లక్షకు పైగా ఖాతాదారులు ఉన్నారు. ఈ ఖాతాదారుల నుంచి ఏటీఎం వినియోగించినందుకు గాను ఛార్జీల కింద ఏటా ఒకసారి రూ.236 వసూలు చేస్తోంది. ఈ లెక్కన ఒక్క ఎస్‌బీఐ వినియోగదారుల నుంచి మంగళగిరి నియోజకవర్గ పరిధిలో సంవత్సరానికి సుమారు రూ.2.5 కోట్ల పైనే వసూలు చేస్తున్నారు. కానీ సేవలు మాత్రం సంతృప్తిగా లేవని ఖాతాదారులు విమర్శిస్తున్నారు.

సీడీఎంల పరిస్థితి మరింత అధ్వానం..

సీడీఎం(క్యాష్ డిపాజిట్ మిషన్)లు సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసరంగా ఖాతాల్లో డబ్బులు వేసుకునేవారు కొందరైతే, చదువు నిమిత్తమో, వైద్యం నిమిత్తమో వేరే వారికి డబ్బులు పంపేవారు మరికొందరు ఈ బ్యాంక్ సేవలను పొందుతున్నారు. అయితే ఎక్కడా సీడీఎంలు పనిచేయకపోవడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సీడీఎంలు మరమ్మతులకు గురికావడం, నెట్‌వర్క్ సక్రమంగా లేకపోవడంతో మధ్యలోనే ఆగిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో



ఆఫ్‌లైన్ అని చూపిస్తున్న ఎస్‌బీఐ ఏటీఎం

అత్యవసరంగా దూర ప్రాంతాల వారికి డబ్బులు వేయాల్సిన వారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు సీడీఎం మిషన్ డబ్బులు తీసుకున్నా జమ కాకపోవడంతో మళ్లీ బ్యాంకుకు వెళ్లి దరఖాస్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఇది వినియోగదారులకు మరింత తలనొప్పిగా తయారైంది.

డబ్బులు నింపే పని ప్రైవేటు ఏజెన్సీలకు..

ఏటీఎంలలో డబ్బులు నింపే పనిని ఆయా శాఖలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి బ్యాంకులు చేతులు దులుపుకొంటున్నాయి. డబ్బులు అయిపోయిన వెంటనే ఆయా ఏటీఎంలలో డబ్బులు నింపకపోవడంతో తరచూ వినియోగదారుల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సొంతంగా బ్యాంకు డబ్బులు నింపే ఏటీఎంలలో కాస్త మెరుగ్గా సేవలు అందుతున్నాయి. అక్కడి ఖాతాదారులు ఫిర్యాదు చేస్తే వెంటనే బ్యాంక్ సిబ్బంది సమస్యను పరిష్కరిస్తున్నారు. కానీ కొన్ని చోట్ల ఏటీఎం నుంచి డబ్బులు సక్రమంగా రాకపోతే అవి రికవరీ అయ్యే సరికి 3 నుంచి 5 రోజుల సమయం పడుతుంది.

ఇబ్బంది పడుతున్నాం..



అత్యవసరమై ఏటీఎంకు వచ్చాను. కానీ ఏటీఎం మిషన్ పనిచేయలేదు. ఫోన్ పే, గూగుల్ పే నాకు లేదు. దీంతో వేరే ఏటీఎంకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఇలా పలుమార్లు ఇబ్బందులు పడ్డాను. ఏడాదికి ఒకసారి సర్వీస్ ఛార్జీలు వసూలు చేసే బ్యాంకులు స్పందించి సక్రమంగా ఏటీఎంలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

– ఎం.విజయ్‌కుమార్, మంగళగిరి

వైఎస్సార్ సీపీ అభివృద్ధిలో యువతే కీలకం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేమారెడ్డి



సమావేశంలో పాల్గొన్న యువజన విభాగాల అధ్యక్షులు

మంగళగిరి, మంగళగిరి టౌన్: వైఎస్సార్‌సీపీ అభివృద్ధిలో యువతే కీలకం అని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. మంగళగిరి బైపాస్ రోడ్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో 42 గ్రామాల యువజన విభాగాల అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో' కార్యక్రమాన్ని పట్టణ, గ్రామ స్థాయిల్లో ఎలా ముందుకు తీసుకువెళ్లాలి అనే అంశంపై దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యక్రమాలపై నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి యువత ముందుండి పనిచేయాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకే నోటిఫికేషన్‌లో లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ పార్టీని బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యువజన విభాగ నాయకులు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, నాగరాజు, గోపిరెడ్డి, దొంతిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మణికంఠ, భాస్కర్, షేక్ కరిముల్లా, భాగ్యరాజు, పులగం సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ అధికారికి వినతిపత్రం అందజేత



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయం అధికారికి పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం వినతిప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ధనార్జనే ధ్యేయంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం దుస్తుల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారని.. ఒక బ్రాంచ్‌కు పర్మిషన్ తీసుకుని అనేక బ్రాంచ్‌లలో క్లాసులు నిర్వహిస్తున్నారని అన్నారు. పైఅంశాలను వివరిస్తూ ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి(ఆర్‌ఐఓ)కు వినతిపత్రం అందజేశామని, సానుకూలంగా స్పందించిన అధికారి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయి మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



డీఎస్పీ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న రవి, కేవీపీఎస్ నాయకులు, బాధిత మహిళలు

తాడికొండ: తుళ్లూరు మండలం మందడం గ్రామంలో ఏపీ సచివాలయానికి కూతవేటు దూరంలో ఎస్సీ కాలనీకి మంచినీరు అందడం లేదంటూ నిరసన తెలిపిన మహిళలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి కోరారు. ఈ మేరకు శుక్రవారం మందడంలోని తుళ్లూరు డీఎస్పీ కార్యాలయంలో ఆయనను బాధిత మహిళలతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీన దళిత మహిళలు మంచినీరు ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేసిన సందర్భంగా పోలీసులు కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. కృష్ణానది చెంతనే ఉన్నా రాజధాని అమరావతిలో మందడంతో పాటు పలు గ్రామాల్లో మంచినీటి సమస్య ఉండడం బాధాకరమన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్పందించి రాజధాని గ్రామాల్లో మంచినీటి సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రాజధాని గ్రామాల తాగునీటి సమస్యల పరిష్కారానికి సీఆర్డీఏ రూ.10.75 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. తుళ్లూరులో నిర్మాణంలో ఉన్న తాగునీటి ట్యాంకు వెంటనే పూర్తి చేసి నేలపాడు, శాఖమూరు గ్రామాలకు రాజధాని కోర్ క్యాపిటల్ పైపులైన్ నుంచి తాగునీరు అందించాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళీ కృష్ణను కలిసి కేసులు ఎత్తివేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాజధాని డివిజన్ కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం నష్ట పరిహారం చెల్లించాలి



దీక్షా శిబిరంలో కార్మికులు, నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 206వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన దుర్గారావు, స్టీవెన్‌లు మాట్లాడుతూ.. కార్మికులకు నష్టపరిహారం చెల్లించకుండా ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ చేసి వెళ్లిన యాజమాన్యం అడ్రస్ లేకుండా పోయిందని అన్నారు. ప్రస్తుతం ఏసీసీ ఫ్యాక్టరీ భూమి ఒక్కటే పరిహారానికి ఆధారంగా ఉందన్నారు. పరిహారం చెల్లించేంత వరకూ కార్మికులు దీక్షలు కొనసాగిస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సుభాని, ఇస్మాయిల్, సాంబశివరావు, సూర్యప్రకాశరావు, గురవయ్య, కార్మికులు ఇమాంబీ, రమాదేవి, సారమ్మ, శివకుమారి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ పరిధి బేతపూడి, ముసగపాడు గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పొగాకు వాడటం వల్ల కలిగే దుష్ఫలితాలు గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ కె.సుదర్శనరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



ఫిరంగిపురం: పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్ఫూర్తి ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని ఫౌండేషన్ ప్రతినిధి శివప్రసాద్ అన్నారు. మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన కె.చంద్రికారాణి ఎన్‌ఆర్‌ఐ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. విద్యార్థికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో స్ఫూర్తి ఫౌండేషన్‌ను ఆమె తల్లిదండ్రులు ఆశ్రయించారు. దీంతో సంస్థ చైర్మన్ శ్రీవ్యాల్ తన ప్రతినిధి శివప్రసాద్‌ను గ్రామానికి పంపించి పూర్తి వివరాలు సేకరించారు. ఫౌండేషన్ తరుపున విద్యార్థి కళాశాల ఫీజు చెల్లించేందుకు రూ.83 వేలు చెక్కు రూపంలో అందజేశారు.

సార్వత్రిక సమ్మెకు సీపీఎం మద్దతు

మంగళగిరి టౌన్: దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు మంగళగిరి సీపీఎం పట్టణ కమిటీ మద్దతు తెలియజేస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్ లాల్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని కార్యాలయంలో శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా జరిగే సమ్మెలో నగర పరిధిలోని పార్టీ సభ్యులు, సానుభూతి పరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాలను వినియోగదారులపై వేశారని విమర్శించారు. సమావేశంలో నాయకులు చెంగయ్య, జేవీ రాఘవులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

హామీలే తప్ప.. అమలెక్కడ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మంగళగిరి, మంగళగిరి టౌన్: రాష్ట్రంలో కూటమి పాలన ఏడాది పూర్తయినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం 'కార్పొరేట్‌లకు వరాలు–పేదలకు శాపాలు' అనే పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి పాలనలో సామాన్యులకు సంక్షేమ పథకాలు అందడం లేదని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి నేటికీ ఆ ఊసే ఎత్తలేదన్నారు. కూటమి పాలన కేవలం కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్, నాయకులు బాలకృష్ణ, చలపతిరావు, గణేష్, బ్రాహ్మణి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌టీ సొసైటీ అధ్యక్షులుగా డాక్టర్ రవికుమార్



రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఎన్‌ఆర్‌టీ సొసైటీ అధ్యక్షులుగా డాక్టర్ వేమూరి రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సహకారంతో తెలుగు వారిని ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని అన్నారు. ఎన్ఆర్ఐల భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానని, రాష్ట్రంలో చదువుకున్న యువతకు విదేశాల్లో ఉద్యోగావకాశాలకు ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ బి.శేషారావు, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఎడ్యుకేషన ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, ఏపీఎన్‌టీసీ ఎండీ గణేష్‌కుమార్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

తాడికొండ: మందడం ఎస్సీ కాలనీ మహిళల సుదీర్ఘ పోరాటం అనంతరం ఎట్టకేలకు అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. గ్రామంలో పైపులైన్‌లు లీకేజీలు ఉన్న కారణంగా నీరు పూర్తిగా కలుషితమై ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మహిళలు రోడ్డెక్కారు. అయితే అధికారులు నామమాత్రంగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చేసి తమపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

ముగిసిన అంతరాష్ట్ర ఏపీసీఐఎస్‌సీఈ క్రికెట్ టోర్నమెంట్



విజేతగా నిలిచిన టీంతో నిర్వాహకులు

ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలం నల్లపాడులోని లొయోలా పబ్లిక్ స్కూల్లో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. జోనల్ స్థాయిలో అండర్–14, అండర్–17 విభాగాల్లో ఆఖరి రోజు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. అండర్–14 విభాగంలో నల్లపాడు లొయోలా పబ్లిక్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. ఎమ్మెస్ రెఫరల్ హాస్పటల్ స్కూల్(చిత్తూరు), స్టెమ్ స్కూల్(గుంటూరు) జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. అండర్–17 విభాగంలో ఎమ్మెస్ రెఫరల్ హాస్పటల్(చిత్తూరు) జట్టు విజేతగా నిలువగా.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(కడప), శ్రీవేద స్కూల్(చిత్తూరు) వరుస స్థానాలను కై వసం చేసుకున్నాయి. అనంతరం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో పాఠశాల కరెస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డా. పి.ఆంటోనీ, ప్రిన్సిపాల్ రెవ.ఫా.డా.సగాయ రాజ్ మార్క్, వైస్ ప్రిన్సిపాల్ రెవ.ఫా.నరేష్ విజేతలకు ట్రోఫీలు అందించి క్రీడాకారులను అభినందించారు.

నేటి నుంచి 'రథ్ ఫెస్ట్ 2025'



ఇస్కాన్ టెంపుల్‌లో స్వామివారు

తెనాలి: 'ఇస్కాన్' టెంపుల్, తెనాలి ఆధ్వర్యంలో 2025 సంవత్సర రథోత్సవం (రథ్ ఫెస్ట్–2025)లో భాగంగా 'జిజ్ఞాస' సంస్థ సహకారంతో వివిధ సాంస్కృతిక అంశాల్లో రెండురోజుల పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొత్తం 51 అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. సంగీతం, భగవద్గీత, చిత్రలేఖనం, పెయింటింగ్, క్రాఫ్ట్ పోటీలు శనివారం, నృత్యం, ఏకపాత్ర, క్విజ్, ఫ్యాన్సీ డ్రెస్, క్రియేటివ్ స్పీకింగ్ క్రియేటివ్ రైటింగ్ వంటి పోటీలను ఆదివారం నిర్వహిస్తారు. శ్రీకృషుడు, విష్ణుమూర్తి, వైష్ణవానికి సంబంధించిన అంశాలను ప్రదర్శించవచ్చని ఫెస్ట్ క్యూరేటర్ రోహిణి వైష్ణవి ఒక ప్రకటనలో తెలియజేశారు. అయిదేళ్ల నుండ 29 ఏళ్ల వయసు కలిగిన ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సాంస్కృతిక పండుగకు రాష్ట్ర నలుమూలల నుంచి 1,000 మంది నమోదు చేసుకున్నారని, ఇంకా ఎవరికైనా ఆసక్తి ఉంటే వైకుంఠపురం ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

నేడు, రేపు ఆల్ ఇండియా చెస్ టోర్నమెంట్



ప్రత్తిపాడు: గుంటూరు రూరల్ మండలం లాంలోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ సహకారంతో ఈనెల 28, 29 తేదీల్లో ఆల్ ఇండియా అండర్–19 చెస్.. ఓపెన్ చెస్ టోర్నమెంట్–2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. టోర్నమెంటుకు సంబంధించిన వాల్ పోస్టర్లను శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం.గోపీనాథ్‌తో కలిసి శుక్రవారం స్థానిక కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామారావు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందిస్తామని అన్నారు, ఆసక్తి ఉన్న వారు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నమెంట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు 97030 49378 నంబరును సంప్రదించాలని చెప్పారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

తెనాలిఅర్బన్: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని 10,11 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ వార్డుల్లో జరుగుతు న్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట పలు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పశువుల వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలి



ప్రత్తిపాడు: పాడి రైతులు పశువుల వ్యర్థాలను ఎస్‌డబ్ల్యూపీసీకి తరలించాలని, అక్కడ కంపోస్టు ఎరువును తయారు చేస్తారని డీఎల్‌పీవో కె. శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీలను ఎంపీడీవో కె.శివపార్వతితో కలిసి ఆయన పరిశీలించారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేస్తున్న విధానాన్ని పరిశీలించి, పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి పాడి రైతులతో మాట్లాడారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై ఆరా తీశారు. మహిళలతో మాట్లాడారు. వెంట ఈవోపీఆర్డీ ఆదం షఫి, సెక్రటరీ ఖాజా తదితరులున్నారు.